22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

గౌలిపురా: గౌలిపురాలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి, రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 4వ వరకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ద్వితీయ శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా–గౌలిపురా, శ్రీ సాయి వాసవీ సేవా సంస్థ సంయుక్తాధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్పాట్ అడ్మిషన్లపై హర్షం

అబిడ్స్: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లకు షెడ్యూల్ విడుదల చేయడం పట్ల తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్.గోపి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కదారు సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో స్పాట్ అడ్మిడషన్లకు అవకాశం ఇవ్వాలని చాలా రోజుల నుంచి తమ గెజిటెడ్ అధ్యాపక సంఘం చేస్తున్న కృషి ఫలించిందన్నారు. నాన్‌లోకల్ విద్యార్థులకు దోస్త్ అడ్మిషన్లలో ఇంతవరకు అవకాశం కల్పించలేదని, అలాంటి విద్యార్థులు మన రాష్ట్రంలో డిగ్రీ చదువుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని కళాశాల విద్యాశాఖ కమిషనర్‌కు, దోస్త్ కన్వీనర్లకు, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికు ఎన్నోసార్లు విన్నవించడం జరిగిందన్నారు. లోకల్ విద్యార్థులతో పాటు నాన్‌లోకల్ విద్యార్థులకు కూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిడషన్లు పొందేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు అన్నారు.

నష్టపరిహారం చెక్కుల అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. యాకుత్‌పురా ఆఫ్రీన్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో యాకుత్‌పురా షేక్ ఫయాజ్ కమన్ ప్రాంతంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌తో కలిసి నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాకుత్‌పురా బడాబజార్ షేక్ ఫయాజ్ కమన్ నుండి డబీర్‌పురా బ్రిడ్జి జబ్బార్ హోటల్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోతున్న 30 మంది బాధిత యాజమానులకు నష్టపరిహారం చెక్కులను అందజేశామన్నారు.

డీ-ఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

నాంపల్లి: మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీ–ఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ కోర్సుల్లో పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. విద్యార్థులు దోస్త్ అడ్మిషన్ ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పాట్ అడ్మిషన్ పొందే విద్యార్థులు ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే అడ్మిషన్ల ప్రక్రియకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఇంటర్ మెమో, బదిలీ ధ్రువీకరణ పత్రం(టీసీ–ఒరిజినల్), 6వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు బోనఫైడ్ సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ పత్రం పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులను దోస్త్‌లో సమర్పించాలన్నారు.

'కాంగ్రెస్ పతనం ఖాయం'



శిల్పారెడ్డిని సన్మానిస్తున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయమని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నియమితులైన సందర్భంగా శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శిల్పారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేస్తూ పూర్తిగా అవినీతి ఊబిలో కూరుకుపోయిందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరిచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేవలం కాంగ్రెస్ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిపోయారన్నారు. నిరుద్యోగం, రాష్ట్రంలో గతంలో ఎన్నడు లేని విధంగా పెరిగిందన్నారు.

ఫుట్‌పాత్.. ఆక్రమణలతో హాంఫట్

- మీరాలంమండిలో కనిపించని పాదబాటలు
- ఆక్రమణలతో నిత్యం ట్రాఫిక్ తిప్పలు



మీరాలంమండి ప్రధాన రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

చార్మినార్: మీరాలంమండి కూరగాయల మార్కెట్ రోడ్డు దుకాణాదారులతో కబ్జా కావడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అటు రైతులతో పాటు ఇటు వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. నిజాం కాలంలో 1805లో అప్పటి ప్రధాని నవాబ్ ఆలం యార్ జంగ్ బహదూర్ అప్పట్లో నగర ప్రజలకు కూరగాయలను అందుబాటులో ఉంచడానికి మీరాలంమండిని ఏర్పాటు చేసినట్లు ఇక్కడి పూర్వీకులు చెబుతున్నారు. నగర ప్రజలకు పెద్ద ఎత్తున అన్ని రకాల కూరగాయలు ఒకే చోట విక్రయించడానికి ఏర్పాటు చేసిన ఈ మీరాలం మండి దశాబ్దాలు గడుస్తున్నా ప్రజాదరణ కొనసాగుతుంది. పాతబస్తీలోని మీరాలం మండి పరిసర ప్రాంతాల వినియోగదారులే కాకుండా దూరపు ప్రాంతాల నుంచి సైతం ఇక్కడికి వచ్చి తమకు అవసరమైన కూరగాయలను కొనుగోలు చేస్తుండటంతో నిత్యం ఈ మార్కెట్ కిటకిటలాడుతుంది.

గంటల తరబడి ట్రాఫిక్‌జామ్

మీరాలంమండి కూరగాయల మార్కెట్‌తో పాటు నిత్యవసర వస్తువుల క్రయవిక్రయాలు సైతం ఇక్కడ పెద్ద ఎత్తున కొనసాగుతాయి. పాతబస్తీకి వెళ్లే రెండు రోడ్ల నడుమ ఈ మీరాలంమండి కూరగాయల మార్కెట్ ఏర్పడింది. మదీనా నుంచి పాతబస్తీకి వచ్చే ప్రధాన రోడ్డులోని పత్తర్‌గట్టి రోడ్డు ద్వారా లోనికి వస్తే మీరాలంమండి కూరగాయల మార్కెట్ దర్శనమిస్తుంది. అలాగే దారుషఫా, పురానీహవేలి ప్రధాన రోడ్డు నుంచి లోనికి వస్తే కూడా మీరాలంమండి దారి కనిపిస్తుంది. ఇలా పాతబస్తీలోని రెండు ప్రధాన రోడ్లకు నడుమ మీరాలంమండి కూరగాయల మార్కెట్, ఫుడ్ గ్రేన్ మార్చెంట్ వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఎంతో చారిత్రాక ప్రాధాన్యత గల ఈ మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. కేవలం 24 అడుగల రోడ్డు ఉన్న ఈ మార్కెట్‌లో ప్రతి రోజు గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తే..

ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంటుందని వాహనదారులు వాపోతున్నారు. దుకాణాల ముందు గల ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డును సైతం కబ్జా చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని కట్టడి చేస్తే ఆశించిన ఫలితాలుంటాయని స్థానికులు అంటున్నారు. ఒక్కసారి ఈ రోడ్డుపైకి వచ్చే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు నరకయాతన అనుభవిస్తున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పోలీసులు ముందుకు రాకపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీంతో వాహనదారులు ఒకరికొకరు వాగ్వాదానికి దిగి ఘర్షణ పడుతున్నారు. ఇక్కడి ఇరుకు రోడ్డులోని ఫుడ్ గ్రేన్ మార్చెంట్స్ దుకాణాల నిర్వాహకులు తమ దుకాణాల ముందు నాలుగైదు అడుగుల మేరకు రోడ్డును ఆక్రమించి తమ వస్తువులను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుంది.దుకాణాల మందు వస్తువులను తొలగిస్తే వాహనాల రాకపోకలతో పాటు పాదచారులకు ఇబ్బందులు తొలగిపోతాయని చెబుతున్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న అందే రాంబాబు

చాంద్రాయణగుట్ట: ఆసరా పింఛన్లను పెంచుతామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి అందే రాంబాబు డిమాండ్ చేశారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని లలితాబాగ్ ముక్కెర బస్తీలో శుక్రవారం వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులందరికి రూ.4 వేల పింఛన్లు ఇస్తామని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ హామీ ఇచ్చారని వాటిని అమలు చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ముందుకొచ్చి పోరాటం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రమేష్, నర్సింగ్ రావు, దార్ల యాదగిరి, శారద, జంగమ్మ, అండాలమ్మ, లక్ష్మమ్మ, సునీత, కళమ్మ, జాఫర్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయాలి




పనులను పరిశీలిస్తున్న సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

చార్మినార్: పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రాజెక్టస్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్ర నగర్ సర్కిళ్ల పరిధి లోని చార్మినార్ ఖిల్వత్ గ్రౌండ్, బహదూర్ పురా మక్కా కాలనీ, జూ పార్కు ఫ్లైఓవర్ ఇనర్ ర్యాంప్, శాస్త్రి పురం స్విమ్మింగ్ పూల్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి, ప్రాజెక్టస్ నిర్మాణ పనులను పరిశీలించామన్నారు. సాంకేతిక సమస్యలను అధిగమించి సాధ్య మైనంత త్వరలో నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామన్నారు. అభివృద్ధి మరమ్మతు నిర్మాణ, డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఫలక్ నుమా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి, చార్మినార్ జోన్ ప్రాజెక్టస్ విభాగం ఎస్ఈ బీ.ఎల్.శ్రీనివాస్, డీఈలు, ఉన్నారు.

పాతకక్షలతో యువకుడిపై దాడి

చాంద్రాయణగుట్ట: పాత గొడవలను దృష్టిలో ఉంచుకొని యువకుడిపై దాడిచేసిన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం....ఫలక్‌నుమా ఫాతీమానగర్‌కు చెందిన జావిద్(35), అక్బర్(40) స్నేహితులు. ఇద్దరి నడుమ పాత గొడవలున్నాయి. గురువారం రాత్రి రోడ్డుపై వెళ్లే క్రమంలో ఒకరినొకరు కోపంతో చూసుకున్నారు. ఆగ్రహానికి గురైన అక్బర్ జావెద్‌పై దాడి చేసి కన్ను భాగంలో తాళం చెవితో గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మూసీ.. ఉద్ధృతి







భారీ వర్షాలతో నిండిన గండిపేట జలాశయం నుంచి ఆరు గేట్లను ఎత్తడంతో నీటి ప్రవాహం పెరిగింది. మధ్యాహ్నం వరకే పురానాపూల్ వంతెన సగానికి, వంద ఫీట్ల జాతీయ రహదారి పురానాపూల్ వద్ద మునిగాయి. నదిలో ఉన్న శివాలయం, జాతీయ రహదారిలో ఉన్న హనుమాన్ దేవాలయం పరిసరాల్లోనూ భారీగా నీరు చేరింది. జాతీయ రహదారి మీదుగా వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

– జియాగూడ

ఇంటిపని వారి పూర్తి వివరాలు తీసుకోవాలి

గోల్కొండ: ఇంట్లో పని మనిషిని ఎంపికలో అన్ని జాగ్రత్తలు పాటించాలని టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండలోని తన కార్యాలయంలో ఇంటి పని మనుషులు, డ్రైవర్ల ఎంపికపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గత కొంత కాలంగా ఇంట్లో పని చేసే మనుషులు, వంట వారు, డ్రైవర్లే హంతకులుగా మారుతున్నారన్నారు. కొన్ని రోజుల పాటు నమ్మకంగా ఉండి యజమానులను ప్రసన్నం చేసుకుంటారని ఆ తర్వాత పక్కా ప్రణాళికలతో ఇంట్లోని వస్తువులను దోచుకోవడం, అవసరమైతే యజమానులను హత్య చేస్తున్నారన్నారు. పనికి పెట్టుకునే ముందు వారి ఆధార్ కార్డుతో పాటు ఇతర గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు.

శుభాకాంక్షలు



చార్మినార్: బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన జగ్‌మోహన్ సింగ్‌ను రాష్ట్ర బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అల్కా మనోజ్, హకీం తయేబీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జగ్‌మోహన్ సింగ్ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీలందరూ పార్టీ వైపు ఆకర్షితులై పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్.గౌతమ్‌రావుకు..



తెలంగాణ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డా. ఎస్.గౌతమ్‌రావు నియమితులయ్యారు. శుక్రవారం మెహిదీపట్నం బీజేపీ అధ్యక్షుడు చింతల రాజేష్‌తో పాటు వేణుగోపాల్, చంద్రశేఖర్, మురళీ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆకట్టుకున్న 'ఇది అతని సంతకం' నాటకం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటక రంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో 'ఇది అతని సంతకం' అనే నాటకాన్ని శుక్రవారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. ఒక మనిషి తన జీవితంలో ఎలా బ్రతకాలో, తాను బతికిన విధానాన్ని బలంగా చిత్రీకరించుకొని సంతకం చేసుకున్న తీరును ప్రదర్శిస్తూ సాగిన నాటకం ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో నాటకరంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అభినయ ఆర్ట్స్ సమర్పణలో స్నిగ్ధ ఈ నాటకాన్ని రచించగా ఎస్.రవీందర్‌రెడ్డి, దర్శకత్వం వహించారు.

ఫుడ్‌పాయిజన్స్‌పై విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: గురుకులాలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్స్, విద్యార్థుల మరణాలపై న్యాయ విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు డిమాండ్ చేశారు. గురుకులాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్ బీసీ సంక్షేమ భవన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జాతీయ, నాయకులు పి.మహేష్, రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌వి.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పి.నాగరాజులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ గురులాలలో కల్తీ ఆహార పదార్థాలను వాడటంతో ఫుడ్ పాయిజన్‌కు గురవుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాలలో కలుషిత ఆహారం తిని 48 మంది విద్యార్థులు మృతి చెందారన్నారు. గురుకులాలలో తమ పిల్లలను చేర్పించాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం నెలల తరబడి అద్దె చెల్లించకపోవడంతో రాష్ట్రంలోని అనేక జిల్లాలలో ఉన్న గురుకుల భవనాల యజమానులు గేట్లకు తాళాలు వేసిన ఘటనలు ఉన్నాయన్నారు. నాణ్యతలేని భోజనం విద్యార్థులకు అందించడంతో విద్యార్థులు తరచూ ఫుడ్‌పాయిజన్లకు గురవుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలోమధు, కిరణ్, రాజేశ్వర్, శ్రీకాంత్, నవీన్, మస్తాన్, అజయ్, రానా ప్రతాప్, మాదారంపు నాగరాజు, ఆసిఫ్, కె.ఝాన్సీ, కొల్లూరి సింహాద్రి పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సాప్ మెడికల్ సెంటర్



యాసర్ అర్ఫాత్‌ను సన్మానిస్తున్న నియాజ్ అహ్మద్ ఖాన్

గోల్కొండ: నిరుపేద కిడ్నీ రోగులకు సాప్ మెడికల్ కిడ్నీ సెంటర్ అండగా ఉంటూ వైద్య సేవలు అందించడం అభినందనీయమని మజ్లిస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు యాసర్ అర్ఫాత్ అన్నారు. శుక్రవారం టోలిచౌకీ సాలర్‌జంగ్ కాలనీలోని సాప్ కిడ్నీ సెంటర్‌ను ఆయన సందర్శించగా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సర కాలంలో తమ కిడ్నీ సెంటర్‌లో నిరుపేదలకు ఉచిత డయాలసీస్ చేశామన్నారు. అంతేకాకుండా తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఉచిత మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి కిడ్నీ స్క్రీనింగ్ చేసి కిడ్నీ రోగ బాధితులకు ఉచితంగా వైద్య సలహాలు అందించామన్నారు. దేశంలో ఎన్నడు లేని విధంగా గత నెల 15 ఆగస్టు రోజున నగరంలో కిడ్నీ వ్యాధి గ్రస్తులకు ప్రత్యేకంగా డయాలసీస్ ప్రీమియర్ లీగ్ నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అండతో నిర్వహించిన ఈ పోటీలకు అనూహ్య సంపదన వచ్చిందన్నారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలలో తాము నిరుపేద డయాలసీస్ రోగ్గులకు ఉచిత డయాలసీస్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షోహెబ్ అహ్మద్ ఖాన్, డాక్టర్ మహ్మద్ అకీబ్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న వరద నీటి పైపులైన్ పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో బల్దియా, జలమండలి అధికారులతో సమావేశమయ్యారు. టోలిచౌకీ నుంచి టూమ్స్ రోడ్డు వరకు సంవత్సరం పైగా పనులు జరిగాయన్నారు. రోడ్డుపై ఉన్న బారీ గుంతలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన కూడా అధికారులు పనులు సకాలంలో పూర్తి చేయలేకపోయారన్నారు. టోలిచౌకీ నుంచి ఎండి లైన్స్ మీదుగా గోల్కొండ వెళ్లే వారు గోల్కొండకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని అయితే వీరంతా ఎండిలైన్స్ వద్ద జరుగుతున్న వరద నీటి పైపులైన్ పనుల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుత్తేదారులతో మాట్లాడి పనులు సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆసీఫ్‌నగర్ నారాయణ స్కూల్ విద్యార్థులు ఖోఖో క్రీడలు అండర్–14 విభాగంలో గోల్కొండ డివిజన్ లెవెల్‌లో ప్రతిభ కనబర్చడంతో శుక్రవారం వారి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనడంతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. గెలుపొందిన విద్యార్థులను నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అభినందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు 25 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీలలో నారాయణ విద్యార్థులు ప్రతిభ కనబరచడం ఆనందదాయకమని ప్రిన్సిపల్ శశికళ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుదర్శన్, ఫిజికల్ డైరెక్టర్ గోపీ, తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఇరువర్గాల పరస్పర దాడి



ఘటన స్థలంలో ఏసీపీ మహ్మద్ మునావర్

విజయనగర్ కాలనీ: స్థల వివాదంలో ఇరువర్గాలు పరస్పర దాడి చేసుకున్న ఘటన శుక్రవారం టపాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ వివరాల ప్రకారం.. గుడిమల్కాపూర్ డివిజన్‌లోని రాంసింగ్‌పురాలో ఉన్న 16 ఎకరాల స్థలం గత కొన్నేళ్లుగా కోర్టులో ఉంది. కాగా ఈ స్థలంలో తన దాయాదుల ఆస్తిలో కోర్టు ద్వారా 3.08 ఎకరాలు అనిలాజైషా(75)కు వచ్చింది. శుక్రవారం ఆమె తన న్యాయవాది వేణుగౌడ్‌తో కలిసి రాంసింగ్‌పురాలో వివాదస్థలం వద్దకు రాగా అదే సమయంలో అక్కడ ఉన్న ప్రతివాదులు ఇక్కడకు ఎందుకు వచ్చావు అంటూ అనిలాజైషాను నెట్టేసి ఆమె న్యాయవాది వేణుగౌడ్‌పై దాడిచేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను నచ్చజెప్పారు. ఇరువర్గాల పరస్పర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'మిలాద్ జులూస్'కు సర్వం సిద్ధం



వేడుకలకు ముస్తాబైన మక్కా మసీదు

చార్మినార్: ఈ నెల 14న మిలాద్–ఉన్–నబీ వేడుకల సందర్భంగా మిలాద్ ర్యాలీలు పెద్ద ఎత్తున జరుగనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే సెంట్రల్ మిలాద్ జులూస్ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. వీరికి తోడు నగర పోలీసు కమిషనర్ ఆధ్వర్యంలో తగిన బందో బస్తు కొనసాగనుంది. వేడుకలను పురస్కరించుకుని ముఖ్యంగా పాత బస్తీలోని దక్షిణ మండలంతో పాటు దక్షిణ ఈస్ట్ మండలం పరిధిలో అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నారు. ఈ నెల 5న వేడుకలుండగా..వినాయక నిమజ్జనోత్సవాలు కూడా ఉండడంతో వేడుకల తేదీ మారిన విషయం తెలిసిందే. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న, వేడుకలు జరిగాయి. 14న వాడవాడలో జులూస్ నిర్వహించనున్నారు. వీధులన్నింటినీ ఆకర్షణీయమై రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించనున్నారు. ఇప్పటికే మక్కా మసీదును వేడుకలకు ముస్తాబు చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

గౌలిపురా: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెందిన హమీదాబీ (51) గత నెల 31న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో కోడలు ఆఫ్సా ఫర్వీన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

- గౌలిపురా సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెంది న బాలకృష్ణ (72) కల్లుకు బానిసయ్యాడు. గత 31వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలిత ం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.